క్లుప్తంగా

ఓటు నమోదుకు స్పెషల్ క్యాంప్‌లు

రాజుపాలెం: మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ లెవెల్ అధికారి(బీఎల్‌వో) సమక్షంలో స్పెషల్ క్యాంప్‌లు శని, ఆదివారాలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు దుర్గేష్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఓటు నమోదు, ఓటరు జాబితాలో తొలగింపులు, సవరణలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



ముప్పాళ్ళ: స్థానిక పోలీస్ స్టేషన్‌ను సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతురావు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. గ్రామాల్లో శాంతిభద్రతలపై తీసుకుంటున్న చర్యలపైన చర్చించారు. ముందుగా సిబ్బంది, విధులు గురించి తెలుసుకున్నారు. రూరల్ సీఐ సుబ్బారావు, ఎస్సై యు.సోమేశ్వరరావు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక క్యాంపెయిన్

సత్తెనపల్లి: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ –2025లో భాగంగా ఈ నెల 23, 24 రెండు రోజుల పాటు నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ బూత్ కేంద్రం వద్ద సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్‌ఓ) సమక్షంలో స్పెషల్ క్యాంపెయిన్ డే ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకోవడం, తొలగింపులు, ఓటరు కార్డులో సవరణలు సంబంధిత బూత్‌లెవల్ అధికారిని సంప్రదించి, ఓటు హక్కు పొందే అవకాశం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఉపాధి పనుల ప్రణాళికపై గ్రామ సభలు

రాజుపాలెం: మండలంలోని కొత్తబోధనం, కోట నెమలిపురి, బీరవల్లిపాయ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. 2025–26కు సంబంధించిన పనుల గుర్తింపు ప్రణాళికలో గ్రామ సభల్లో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో చెవుల వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ అల్లాభక్షి, ఉపాధి సిబ్బంది, మేట్‌లు పాల్గొన్నారు.

26న సామూహిక వ్రతం

బెల్లంకొండ: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కేతవరం వజ్ర లక్ష్మీనారసింహుని ఆలయంలో మంగళవారం సామూహిక సత్యనారయణ స్వామి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ ఈవో అవుడూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కార్తిక మాసం కృష్ణ పక్షం ఏకాదశి ఆలయ అర్చకులు ప్రసన్నకుమారాచార్యులు ఆధ్వర్యంలో వ్రత కార్యక్రమాలు ఉంటాయన్నారు. పూజలలో పాల్గొనదలచిన భక్తులు ముందుగా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ పాశం నరసింహారెడ్డి, సభ్యుడు ఈమని వెంకటరెడ్డి తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం



అమరావతి: రజకులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని అఖిల భారత రజక సంఘం జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం అత్తలూరులో ఈ నెల 13న దాడి ఘటనలో గాయపడిన తురకపల్లి గురవయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనిల్ కుమార్ మాట్లాడుతూ గురవయ్య కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రశాంత్, రమాదేవి, శ్రీనివాసులు, లక్ష్మణ్, రఘు, కిట్టు, తుమ్మపూడి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో శని, ఆదివారం రెండు రోజులపాటు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అఫ్రపున్నీసా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ శిబిరాలలో 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు కొరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఓటుకు సంబంధించిన అడ్రస్, పేరు మార్పులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాలలో గల పోలింగ్ స్టేషన్లో బిఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

సారూ, పొలం పిలుస్తోంది!

- గ్రామాల్లో మొక్కుబడిగా వ్యవసాయశాఖ కార్యక్రమం
- హాజరుకాని అనుబంధ శాఖల అధికారులు
- పిలిచినా స్పందించడం లేదని..విమర్శలు
- మండల వ్యవసాయ అధికారులతోనే మమ
- ఫ్లెక్సీల్లో ప్రచారం తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రయోజనం శూన్యం
- రైతులకు అందని సలహాలు, సూచనలు



బెల్లంకొండలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం ఫ్లెక్సీతో ఇలా ముగిసింది...

బెల్లంకొండ: పంటల సాగులో రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి నాణ్యమైన, మంచి దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు అందించడమే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం లక్ష్యం . సేద్యంలో మెలకువలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు ప్రతి స్పందన పూర్తిగా కరువైంది. నియోజకవర్గ వ్యాప్తంగా నామమాత్రంగా సాగుతోంది. వ్యవసాయ శాఖ అధికారులు మినహా అనుబంధ శాఖల అధికారులు సిబ్బంది గైర్హాజరవుతుండడంతో అభాసుపాలవుతోంది. పొలాల్లో నలగురు రైతులు వెనకాల చేరి ఒక ఫ్లెక్సీ పట్టుకుంటే.. దాని ముందు వ్యవసాయశాఖాధిరి ఒక ఫోజు ఇచ్చి..హమ్మయ్యా.. ఈ రోజుకు పనిపూర్తయ్యిందని చేతులు దులుపుకుంటున్నారు. ఇందులో ప్రచారమే తప్ప క్షేత్రస్థాయిలో తమకు ఎలాంటి ఉపయోగం లేదని రైతులే చెబుతున్నారు.

'పొలం పిలుస్తోంది' షెడ్యూల్ ఇలా

ఈ ఏడాది సెప్టెంబర్ నెల 24న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో 2025 జనవరి రెండవ తేదీ వరకు నిర్వహించాల్సి ఉంది. వారంలో రెండు రోజులపాటు మంగళ, బుధవారాల్లో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతివారం నాలుగు గ్రామాల్లో నిర్వహించాల్సి ఉంటుంది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందించిన ఫలితం కనిపించడం లేదు.

నీరుగారుతున్న లక్ష్యం...

రైతులకు సాగు వ్యయం తగ్గింపు, మెరుగైన సాగు పద్ధతులు, మేలైన రకాల వంగడాలపై అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. తద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలి. శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహించి, రైతులకు ఉన్న సందేహాలను తీర్చాలి. ఇందుకు ప్రతి మంగళ, బుధవారాల్లో ఉదయం 8:30 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి 5 గంటల వరకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, పంటలను పరిశీలించి సూచనలు చేయాలి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలి. కానీ, క్షేత్రస్థాయిలో అనుకున్న రీతిలో కార్యక్రమం జరగడం లేదు. అనుబంధ శాఖల అధికారులు డుమ్మా కొట్టడం, వ్యవసాయ అధికారులు కూడా ముందుగా ఎంపిక చేసిన రైతుల పొలాల్లోకి వెళ్లి ఫోటోలు దిగి వెళ్లిపోతున్నారు.

ఈ అధికారులెక్కడైనా కనిపించారా?

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ శాఖతో పాటు అనుంబంధ శాఖల అధికారులు పాల్గొని ఆహార, వాణిజ్య, పండ్లు, పూల తోటలు, పట్టు తదితర సాగు రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసి, నాణ్యమైన దిగుబడులు సాధించేలా చైతన్య పరచాలి. కానీ, నియోజకవర్గంలోని ఐదు మండలాల వ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాల్లో కేవలం వ్యవసాయ శాఖ అధికారులు మాత్రమే పాల్గొంటున్నారు. అనుబంధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కావడం లేదు. వ్యవసాయ శాఖతోపాటు ఆత్మ, సెరికల్చర్, ఉద్యాన శాఖ, పశు సంవర్ధక శాఖ, ఏపీ డెయిరీ డెవలప్మెంట్, ప్రకృతి వ్యవసాయం, కో–ఆపరేటివ్ ఫెడరేషన్, మార్కెటింగ్ శాఖ, మత్స్య శాఖ, ఇరిగేషన్, విద్యుత్ ఇలా సుమారుగా 10 శాఖల అధికారులు విధిగా హాజరు కావాల్సి ఉంది. కానీ వీరెవరు ఆ దరిదాపుల్లో కూడా కనిపించడం లేదు. వ్యవసాయ సిబ్బంది కార్యక్రమం నిర్వహిస్తున్నప్పటికీ రైతుల నుంచి స్పందన లభించకపోవడంతో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది.

అన్ని శాఖలకు సమాచారం ఇస్తున్నాం

ప్రతి వారం నాలుగు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అన్ని శాఖల అధికారులకు షెడ్యూల్ పంపించాం. రైతులకు ముందు రోజే సమాచారం ఇస్తున్నాం . పొలాలకు వెళ్లి రైతులకు అన్ని రకాల సలహాలు సూచనలను అందజేస్తున్నాం.

– డి.కృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి, బెల్లంకొండ

అధికారులందరూ హాజరు కావాలి



వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరయ్యేలా ప్రణాళికలను ముందుగానే రూపొందించాం. అన్ని శాఖల అధికారులు కచ్చితంగా హాజరు కావాలి. రైతుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలి. కార్యక్రమానికి హాజరుకాని వారిపై వారిపై ఉన్నతాధికారులకు తెలియజేసి, హాజరయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– వి.హనుమంతారావు, ఏడీఏ, క్రోసూరు

న్యాయవాదుల రక్షణకు కొత్త చట్టాలు చేయాలి

సత్తెనపల్లిలో న్యాయవాదులు విధుల బహిష్కరణ



న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదుల

సత్తెనపల్లి: న్యాయవాదుల రక్షణకి ప్రభుత్వాలు కొత్త చట్టాలు చేయాలని సీనియర్ న్యాయవాది డి.శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు పట్టణంలోని తాలూకా న్యాయస్థాన సముదాయ భవన ఆవరణలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ తమిళనాడులో న్యాయవాది హత్య, విశాఖపట్నంలో మహిళా న్యాయ విద్యార్థిపై లైంగిక దాడిని ఖండించారు. అనంతరం కోర్టు విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల రవి, మన్నెం వెంకటేశ్వరావు, నాగూర్ బాబు, న్యాయవాదులు బీఎల్ చిన్నయ్య, కళ్లం వీరభాస్కర్‌రెడ్డి, ఆర్‌జీకే మూర్తి, బాలకోటయ్య, ఎస్.బాబురావు, జూపల్లి శేషయ్య, నరిసేటి వేణుగోపాల్, అన్నెం వెంకట కృష్ణారెడ్డి, సురే వీరయ్య, మేదర అనిల్ కుమార్, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, రామిరెడ్డి, వెంకట శివ, జొన్నలగడ్డ విజయ్, చావా బాబురావు, కుమార్, బి. సంగీత రావు, గుజ్జర్లపూడి ఏసురత్నం, నాగార్జున, విద్యాసాగర్‌రెడ్డి, పాపారావు, హరినాథ్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న కమిటీ అధ్యక్షుడు శేషయ్య

సత్తెనపల్లి: వర్క్ చార్జర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పీడబ్ల్యూడీ వర్క్ షాప్ అండ్ కెనాల్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు టి.శేషయ్య, ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రంగయ్య కోరారు. ఎస్ఎస్‌పీ ఈఈ శ్రీనివాసరావును క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువల పరిధిలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. సిబ్బంది కొరత, ఉద్యోగ విరమణ, సర్వీసులో చనిపోయిన వారి స్థానంలో తిరిగి నియామకాలు చేపట్టకపోవడం, ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన ఖాళీలు భర్తీ చేయకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. ఆయా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతి లేని, ప్రభుత్వ లెక్కల్లో లేని లక్ష ఎకరాలకు పైగా మెట్ట భూమి మాగాణిగా సాగు చేయడం ద్వారా చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ప్రధాన కాలువ మీద ప్రత్యామ్నాయంగా నకరికల్లు, అత్తిమెళ్ళ, దూపాడు ప్రాంతాల్లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణం చేస్తే.. భూగర్భ జలాలు పెరిగి, పుష్కలంగా సాగునీరు, తాగునీరు అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శులు కంబాల శ్రీనివాస్, కాళిదాసు ఉన్నారు.

రేపు వడియరాజుల కార్తిక వన సమారాధన




మాట్లాడుతున్న బత్తుల వెంకట స్వామి

సత్తెనపల్లి: వడియ రాజుల కార్తిక వన సమారాధనను విజయవంతం చేయాలని వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి పిలుపునిచ్చారు. భీమవరంలో నియోజకవర్గ స్థాయి వడ్డెర కుల ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా బత్తుల వెంకటస్వామి మాట్లాడుతూ ఆదివారం భీమవరంలోని కాటి అంకమ్మ తల్లి దేవస్థాన కల్యాణ మండపంలో సమావేశం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆత్మీయ అతిథిగా ఎమ్మెల్సీ, మాజీ డీఐజీ చంద్రగిరి ఏసురత్నం పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వడ్డెర కులస్తులందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సంఘ నాయకులు గుంజి విజయ్‌కుమార్, కొమెర వీరాంజనేయులు, ఒంటిపులి నాగేశ్వరరావు ఉన్నారు.

రేపు బ్రాహ్మణ కార్తిక సమారాధన

సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జు ననగర్‌లో గల సత్యధ్యాన మందిరంలో ఈ నెల 24న పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం, సత్యధ్యాన మందిరం కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తీక సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సుపరింటిండెంట్ డాక్టర్ రమణ యశస్వి, బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది గిరిరాజు నాగేశ్వరరావు, ముప్పాళ్ళ వ్యాపారి కేశానుపల్లి రాఘవయ్య, వరలక్ష్మి దంపతులకు సన్మానం ఉంటుందన్నారు. బ్రాహ్మణ సోదరులు పాల్గొని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 8గంటలకు కార్యక్రమం ప్రారంభమై, మధ్యాహ్నం విందు ఉంటుందని తెలిపారు.

26న కార్తిక దీపోత్సవం



సత్తెనపల్లి: కార్తిక మాసం ఏకాదశి ఈ నెల 26న మహారాష్ట్ర వీధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో 'కార్తీక దీపోత్సవ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 7 గంటలకు విశేష అలంకరణతో స్వామి వారి దివ్యదర్శనం , హనుమాన్ చాలీసా పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ,రాత్రి 8 గంటలకు దీపోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హజరై స్వామివారిని దర్శించుకుని, దీపోత్సవంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అచ్చంపేట: స్థానిక హరిహర క్షేత్రంలో నెలకొన్న శ్రీ వేంకటేశ్వరస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు చేపట్టారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

కార్తిక వన సమారాధన

క్రోసూరు: మండల కేంద్రంలోని వాసవీ కన్యవకాపరమేశ్వరీ దేవస్థానంలో ఆర్యవైశ్య కుటుంబాలు శుక్రవారం కార్తిక వన సమారాధన నిర్వహించాయి. ఈ సందర్భంగా సత్య నారాయణ వ్రతం నిర్వహించారు. వనభోజనాలు చేశారు. సాయంత్రం అయ్యప్ప మాల ధారులు భజనలు నిర్వహించారు. ఆర్యవైశ్య కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొన్నాయి. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

డిసెంబర్ 31 లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాలరావు



సమీక్ష చేస్తున్న పీడీ వేణుగోపాలరావు

సత్తెనపల్లి: పట్టణ పరిధిలో బేస్మెంట్ లెవెల్ పూర్తి చేసిన పక్కా గృహాలను డిసెంబర్ 31 లోపు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్.వేణుగోపాలరావు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమినిటీస్ సెక్రటరీలు, గృహ నిర్మాణ కాంట్రాక్టర్ల తో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడీ వేణుగోపాలరావు మాట్లాడుతూ పట్టణ పేదలకు సంబంధించి బేస్మెంట్ లెవల్ దాటిన గృహాలు 1,200 వరకు ఉన్నాయన్నారు. వాటిని డిసెంబర్ 31 లోపు తప్పని సరిగా పూర్తి చేయాలన్నారు. సచివాలయాల వారీగా లక్ష్యాలు విధించారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, పట్టణ పరిధిలోని ఎమినిటీస్ సెక్రటరీలు, గృహ నిర్మాణ కాంట్రాక్టర్లు ఉన్నారు.

రూ.3.74లక్షల ఎరువుల నిల్వలు సీజ్



దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ శివాజీ, ఏఓ అరుణ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేర ఎరువుల దుకాణంలో నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని రూ.3,74,330 విలువ గల ఎరువుల నిల్వలను సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.శివాజీ శుక్రవారం తెలిపారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఉన్న అంజిరెడ్డి సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణంలో రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా దుకాణంలోని పురుగు మందుల నిల్వలు, సేల్ రిజిష్టర్, ఇన్వాయిస్‌లు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు చూపించలేకపోవటంతో సంబంధిత నిల్వలను సీజ్ చేశారు. తనిఖీల్లో రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీస్ ఏఓ చల్ల గుండ్ల ఆదినారాయణ, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్

ముప్పాళ్ళ: సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా అవసరమైన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎం.భవానిశంకర్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని ముప్పాళ్ల, చాగంటివారి పాలెం, గోళ్లపాడు, తొండపి గ్రామాల పరిధిలో ఎన్నిక ప్రక్రియ జరగనుంది. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు గాను తీసుకోవాల్సిన చర్యలపైన పలు సూచనలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్‌ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

కార్తికం.. నీలేశ్వరం

- కోరిన కోర్కెలు తీర్చే నీలేశ్వరపాలెం నీలకంఠేశ్వరస్వామి
- కార్తిక మాసంలో స్వామివారి దర్శం మహాభాగ్యం
- చివరి సోమవారం సెల తిరునాళ్లకు ఏర్పాట్లు



ఎత్తైన కొండలమధ్య నీలకంఠేశ్వరుని దేవాలయం



స్వయంభుగా వెలసిన శ్రీ గిరిజా సమేత నీలకంఠేశ్వరస్వామి

అచ్చంపేట: కార్తిక మాసం అంటే శివునికి అత్యంత ప్రీతికరం. ఈ మాసంలో శివకేశవులను ఆరాధించినవారు పాప విముక్తులవుతారని ప్రతీతి. పాపపరిహారార్థం రెండు ఎత్తైన కొండల నడుమ వెలసిన నీలకంఠేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. స్వామివారిని దర్శించుకుని, రాత్రి ఆలయంలోనే బస చేస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. సంతానప్రాప్తి కలుగుతుందని, ఆయురారోగ్యాలతో ఉంటారని విశ్వాసం. అంతటి మహా శక్తిగల నీలేశ్వరపాలెంలోని గిరిజా సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయం సోమవారం సెల తిరునాళ్లకు ముస్తాబవుతోంది.

దేవాలయ విశిష్టత

మండల కేంద్రమైన అచ్చంపేటకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలోని ఓ కుగ్రామం నీలశ్వరపాలెం. ఈ గ్రామం చివరగల రెండు ఎత్తైన కొండల మధ్య స్వయంభుగా వెలసిన పరమశివునికి 18వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతారు. ఎత్తైన కొండల మధ్య నుంచి సెల ధారలు ఆలయ ప్రాంగణంలోకి రావడం అద్భుత దృశ్యం. ఏటా కార్తిక మాసంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. ముఖ్యంగా కార్తిక సోమవారాలు, కార్తిక ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి రోజుల్లో స్వామి వారి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుంది. ఆలయం సమీపంలో కులాలవారీగా భక్తులు కార్తిక వన సమారాధనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇక చివరి సోమవారం స్వామివారికి తిరునాళ్ల నిర్వహిస్తారు. విద్యుత్ ప్రభలు కడతారు. గిరిజాసమేత నలీకంఠేశ్వరస్వామివారికి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహిస్తారు. వీర శైవమతస్తులు ఆలయ ప్రాంగణంలో వీరభద్రుని పళ్లెం పెట్టి దళ్లరభలతో నిర్వహించే ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంటుంది.

రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి

ఇంతటి మహత్తుగల ఆలయ అభివృద్ధిని ప్రభుత్వాలు విస్మరించడంతో 2019లో ఆలయ ప్రాంగణాన్ని రజక సేవా సంఘం అభివృద్ధి చేసింది. ప్రాంగణంలో జ్యోతిర్లింగాలు ప్రతిష్ఠించారు. ఆలయం ముందు ఆరడుగుల నందీశ్వరుని విగ్రహాన్ని నెలకొల్పారు. కొండుకు దిగువ భాగంలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పొంగళ్లు పొంగించుకునేందుకు ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేశారు. ఆలయ ముఖ ద్వారాన్ని ఆధునీకరించారు.

సెల తిరునాళ్లకు ఏర్పాట్లు

రెండు కొండలపై నుంచి స్వామివారి ఆలయ ప్రాంగణంలోకి సెల ధారలు రావడం ఆలయ ప్రత్యేకత. ఈ సెల ధారలు ఎక్కడి నుంచి వస్తాయనేది అంతుబట్టని ప్రశ్న. వర్షపు నీరు నిల్వ ఉండి ధారలుగా వస్తాయని కొంత మంది చెబుతారు. స్వామి మహత్యం వల్లే జలధారలు స్వామి చెంతకు వస్తాయని మరికొంత మంది చెబుతారు. అలా సెల ధారలు వస్తాయి కాబట్టే ఇక్కడ నిర్వహించే తిరునాళ్లను సెల తిరునాళ్లగా పిలుస్తుంటారు. ఈ నెల 25న వచ్చే చివరి సోమవారం నాడు స్వామివారికి తిరునాళ్లను నిర్వహించేందుకు భక్తులు సన్నాహాలు చేస్తున్నారు.

ఉచిత గ్యాస్ నగదు ఖాతాల్లో పడటం లేదు

ఐద్వా పట్టణ అధ్యక్షురాలు మునగా జ్యోతి



సత్తెనపల్లి: ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ చేసుకున్న మహిళల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కావడం లేదని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు మునగా జ్యోతి అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్ లో శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ఇప్పటి వరకు పట్టణంలోని అనేక మంది మహిళలకు గ్యాస్‌కి నగదు చెల్లించి తీసుకున్నారని చెప్పారు. అయితే వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ కావడం లేదని, ఫోన్లకు మెస్సేజ్ రావడం లేదన్నారు. ఆ నగదు ఖాతాల్లో పడ్డాయో లేదో తెలుసుకోవడం కోసం మహిళలు పనులు మానుకొని బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని తెలిపారు. సమావేశంలో ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమ శ్రీ, సభ్యులు ధరణికోట విమల ఉన్నారు.